



సమావేశంలో మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్

రాయచోటిలో కుండపోత..

- గంటల వ్యవధిలోనే ముంచెత్తిన వర్షం
- కాలనీలన్నీ జలమయం
- కాలువలను తలపించిన ప్రధాన రహదారులు
- భారీగా ఆస్తి నష్టం
- వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి
- బాధితులకు ప్రభుత్వ పరిహారం అందజేత
- పాలకుల తప్పిదాలతోనే ప్రమాదం : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భారీ వర్షాలు రాయచోటిని వణికించింది. భారీ వర్షంతో నగరం జలమయమైంది. పట్టణంలోని అన్ని కాలనీలు వరద నీటిలో మునిగిపోయాయి. ప్రధాన రహదారులన్నీ కాలువలు తలపించాయి. లోతట్టు ప్రాంతానికి భారీగా వరద నీరు చేరడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. గురువారం తెల్లవారుజామున నుండి శుక్రవారం అర్ధరాత్రి వరకు కురిసిన భారీ వర్షం రాయచోటిలో 145.4 మిల్లీ మీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. రాయచోటి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఏకతాటిగా కురిసిన భారీ వర్షానికి రాయచోటి పట్టణంలోని డ్రెయినేజీ కాలువలు పొంగి ప్రవహించాయి. ఈ డ్రెయినేజీ నీటిలో చిక్కుకొని నలుగురు మృత్యువాత పడ్డారు. రాయచోటి పట్టణం కొత్తపేట రామాపురంలోని నాలుగు కుళాయిలవీధిలో ఓ ఆటో వరద నీటి ప్రవాహానికి ఇరుక్కుపోయింది. ఆటో సగానికిపైగా నీటిలో మునిగిపోగా ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులలో 1వ తరగతి చదువుతున్న యామిని (7) అనే విద్యార్థిని నీటి ప్రవాహంలో చిక్కుకోగా స్థానికులు రక్షించేలోపే కొట్టుకుపోయింది. ఎస్ఎన్ కాలనీలో ఇలియాస్ (8) అనే బాలుడు కొవ్వొత్తులు తీసుకొచ్చేందుకు అంగడికి వెళ్తూ డ్రెయినేజీ కాలువ దాటుతూ గల్లంతయ్యాడు. కుమారుడిని రక్షించేందుకు తల్లి మున్నీ(28)కూడా గల్లంతైంది. గమనించిన స్థానికుడు వరిగల గంగయ్య (26) అనే యువకుడు వారిని కాపాడబోయి చివరికి అతడూ గల్లంతయ్యాడు. ఈ ముగ్గురు డ్రెయినేజీ కాలువల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. దిగువన ఉన్న గవర్నర్ కల్యాణ మండపం సమీపంలో మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన బాలిక ఆచూకీ కోసం పోలీసులు, ఫైర్ సిబ్బంది శనివారం ఉదయం 8 గంటల వరకు డ్రెయినేజీ కాలువలు, మాండవ్య నది పరివాహక ప్రాంతాన్ని గాలించి ఎట్టకేలకు పాత రాయచోటి బ్రిడ్జి వద్ద బాలిక యామిని మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం బాలిక మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.




ముగ్గురు మృతికి కారణమైన గుంత

భారీ వర్షంతో ఇంట్లోకి చేరిన నీరు

రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షం కురుస్తోంది. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతమైన షేక్ ఆసుపత్రి వద్ద ఉన్నా ఓ ఇంట్లో వర్షం నీరు చేరి భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. సుమారు రూ.2 లక్షల విలువైన ఇంటి వస్తువులు నీట మునగాయని ఇంటి యజమాని వై.సుబ్బరాయుడు వాపోయారు. తక్షణమే స్పందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ, ఆర్థిక సాయం అందజేత

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హుటాహుటిన విజయవాడ నుంచి బయలుదేరి రాయచోటికి చేరుకుని బాలిక గల్లంతైన ప్రాంతాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మృతి చెందిన నలుగురికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరఫున మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని, పట్టణ ప్రజలందరూ భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్

మృతి బాధాకరం : శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి పట్టణంలో కురిసిన భారీ వర్షాల వల్ల నలుగురు వ్యక్తులు వరద నీటిలో కొట్టుకుపోయి, మృతి చెందిన కుటుంబాలను వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, [illegible] ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, రాయచోటి పట్టణ కన్వీనర్ నవాజ్, సర్పంచ్ రామాంజులు, మాజీ ఎంపిటిసి హరినాథ రెడ్డి, జిల్లా మైనారిటీ స్టీరింగ్ కమిటీ సభ్యులు రసూల్, అమరనాథ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పాలకుల తప్పిదం వల్లే నలుగురి మృతి : సిపిఎం

రాయచోటి అర్బన్ : శుక్రవారం రాత్రి రాయచోటి పట్టణంలో కురిసిన భారీ వర్షాలకు నలుగురు మృతి చెందడానికి కారణం పాలకుల తప్పిదాలేనని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. భారీ వర్షాలతో వర్షపు నీరు వరదలా పారి నలుగురు మృతికి కారణమైన ప్రమాద స్థలాలను శనివారం సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, పాలకులు ఉదాసీనంగా వ్యవహరించడం, అధికారులు మామూళ్ల మత్తులో ఉండి సరిగా స్పందించకపోవడం తదితర కారణాలతో పట్టణంలో వర్షపు నీటి ఉధృతి పెరిగి నలుగురు మృతికి కారణమైందన్నారు. నాలుగు కుళాయిల వద్ద, డైట్ హాస్టల్ గేటు వద్ద పెద్ద గుంత ఏర్పడిన భాగాన్ని అధికారులు సందర్శించినా, ఇంటి కింది భాగం కొట్టుకు పోయినా అధికారులు ఇప్పటి వరకు ఇక్కడ కాలి చేయించలేదని తెలిపారు. మున్సిపల్, రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇష్టారాజ్యాంగా నాణ్యత లేని రోడ్లు వేశారని, చిన్నచిన్న డ్రైనేజీ కాలువలు నిర్మించారని ఫలితంగా వర్షం నీరు ఇళ్లలోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా సరైన జాగ్రత్తలు తీసుకుని అక్రమ కట్టడాలను తొలగించి కాలువలను వెడల్పు చేసి పునర్ నిర్మించాలని కోరారు. గత కలెక్టర్ భారీ వర్షాలకు సెలవులు ప్రకటించి ప్రాణనష్టం జరగకుండా చేశారని, కానీ నేడు భారీవర్షం ఉంటే జిల్లా అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలకన్నా అప్రమత్తం చేయడంలో విఫలం అయ్యారన్నారు. నలుగురు మృతికి ముమ్మాటికీ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 6 నెలల కిందట మంత్రి అక్రమ నిర్మాణాలను కూల్చడం మీద దృష్టి పెట్టినా అది కాస్త మున్నాళ్ల ముచ్చటగా మారిందని వాపోయారు. ఎస్ఎన్ కాలనీలో ముగ్గురి మరణానికి కారణం కాలువ మీద పై కప్పు వేయకపోవడమేనని అని పేర్కొన్నారు. మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం రూ. 5 నుండి రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అక్రమ కట్టడాలు మీద, కాలువల కబ్జాదారుల మీద, ముందస్తు హెచ్చరిక చేయని అధికారుల మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో భారీవర్షాలు కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా కలెక్టర్, మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు శాఖ కార్యదర్శి జి.మాధవయ్య స్థానికులు పాల్గొన్నారు.



పట్టణంలోని ఓ ఇంట్లోకి వర్షం నీరు చేరడంతో దెబ్బతిన్న వస్తువులు



బాలిక మృతికి కారణమైన కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

- విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయకపోతే ఉద్యమిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సమావేశం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించారు. జిల్లా నాయకులు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా విఆర్ఎల సమస్య ఏ ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదన్నారు. విఆర్ఎలకు 8 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు గాని విఆర్ఎల కష్టాలు, సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. విఆర్ఎలతో అక్రమ డ్యూటీలు చేయిస్తున్నారని, చాలీ చాలని జీతం ఇస్తూ బండ చాకిరి చేయిస్తున్నారని, విఆర్ఎలు శ్రమ దోపిడికి గురవుతున్నారని, పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేసి ప్రభుత్వము ఆదుకుంటుందన్నారు. ఇక్కడ మన రాష్ట్రంలో కూడా విఆర్ఎలకు పే స్కేలు అమలు చేయాలని మంత్రులు, అధికారులు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా కనికరించడం లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో విఆర్ఎల గురించి ప్రస్తావన లేదని ఆవేదన చెందారు. చదువుకున్న వీఆర్ఏలు ఎప్పటికైనా విఆర్ఎగా ఉద్యోగోన్నతి పొందుతారని ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా కనిపిస్తున్న వారిని విఆర్ఎలుగా గుర్తించడం లేదన్నారు. ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వీఆర్ఏలకు వయోభారం పెరుగుతుందన్నారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు చెందిన విఆర్ఎలను ఆకలి బాధల నుండి ప్రభుత్వం ఆదుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70 శాతంకు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. విఆర్ఎల సమస్యలు పరిష్కారం చేయకపోతే త్వరలో విజయవాడ కేంద్రంగా ధర్నాలకు సిద్ధమవుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీస వేతనం రూ 18000 ఇస్తానని ఎన్నికల్లో చెప్పి ఒక రూపాయి పెంచకపోగా సిఐటియు పోరాడి సాధించుకున్న డిఎ రూ.300 రికవరీ చేశారన్నారు. ఎన్నికల్లో విఆర్ఎలు వేతనాలు పెంచుతామన్నా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వేతనాలు పెంచలేదన్నారు. తెలంగాణలో పే స్కేల్ అమలు చేయడంతో వీఆర్ఏలకు దాదాపు రూ.20 వేలు పైగ వేతనాల అమలు అవుతు న్నాయన్నారు. వేతనాలు పెంచకుండా ఖాళీలు భర్తీ చేయకుండా విఆర్ఎలతో నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు, డ్రైవింగ్ డ్యూటీలు, అక్రమంగా చేయిస్తున్నారన్నారు. వాటిని తక్షణం రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటలను రద్దుచేసి పెత్తందారులకు అనుకూలంగా 12 గంటలకు పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 10 గంటలకు పెంచిందన్నారు. పని గంటల పెంపుకు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. వీఆర్ఏలు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నది సిఐటియు మాత్రమేనని, పోరాడే సంఘాన్ని బలపరిచి తమహక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్‌జిఒ హోం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావనకు వినతి పత్రం అందజేశారు. తమ పరిధిలో ఉన్న అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయడానికి కృషి చేస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు రవికుమార్, నాయకులు మధు, మోడీ ప్రసాదు, లక్ష్మీకర్, మణి, నరసింహులు, కోటి, తిరుపాలు, షేక్ ఖాదరవల్లి, లావణ్య, రత్నమ్మ, రమణయ్య, పేరయ్య శ్రీను, బలరాం, సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో విఆర్ఎలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఎస్ఇ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ కార్మికులు

కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

ఎస్ఇ కార్యాలయం ఎదుట ధర్నాలో యూనియన్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ రెగ్యులర్ చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణం లోని విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం ఎదుట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు పెద్దఎత్తున నిర్వహిం చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ పాదయాత్రలో మంత్రి లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని, కార్మికులందరిని వెంటనే రెగ్యులర్ చేయాలంటూ డిమాండ్ చేశారు. కొనేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయకపోతే వారి పక్షాన నిలబడి ఉద్యమించడానికి సిఐటియు ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ సమస్యలు తీరేవరకూ పోరాటం ఆగదన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఏపీ ప్రభుత్వం కూడా రూ.కోట ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలన్నారు 20, 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులందరికీ వెంటనే రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలన్నారు. సంస్థలో పనిచేస్తున్న కొత్త ఆపరేటర్లకు కూడా పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్ అందరికీ స్కిల్ వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని పేర్కొన్నారు. పమాదాల బారిన పడిన, అనారోగ్యం పాలైన కార్మికులకు ఉచితంగా అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డులను అందివాలని కోరారు. తమ సమస్యలను వెంటనే పరి ష్కరించకపోతే అక్టోబర్ 6 నుంచి తిరుపతి ఎపిఎస్‌పిడిసిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామంటూ హెచ్చరించారు. ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు చంద్రశేఖర్‌రెడ్డి, రాయచోటి డిఇ యుగంధర్ విచ్చేసి కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. తమ పరిధిలో లేని వాటిని ఉన్నతాధికారులకు నివేదించి పరిష్క రించేలా చూస్తామంటూ చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యుఇఇయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి హరి, సంఘం నేతలు ఏవి రమణ, రెడ్డప్ప, కిరణ్, శ్రీనివాసులు నాయుడు, అమర్నాథ్ రెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, స్వాతి, సుజాత ,సరస్వతి, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాయచోటి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేష్ గౌడ్, శ్రీనివాసరెడ్డి రాజంపేట డివిజన్ అధ్యక్షులు బాలకృష్ణ, సురేంద్ర మదనపల్లి డివిజనల్ అధ్యక్షులు నారాయణ తోపాటు జిల్లాలోని అన్ని డివిజన్లకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిఎం సహా ఆరుగురి సస్పెన్షన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : నష్టాల ఊబిలో ఉన్న ఆర్‌టిసిని గట్టెక్కించేందుకు గత ఏడాది డిసెంబర్ 7వ తేదీన ఆర్‌టిసికి అనుబంధంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో భారీ కుంభకోణం జరిగినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. పెట్రోల్ బంకు ప్రారంభమైనప్పటి నుం,ఇ ఆగస్టు వరకు సుమారు 8 నెలలకు గాను రూ.63 లక్షల భారీ కుంభకోణం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. ఈ కుంభకోణంలో డిపో మేనేజర్ రమ ణయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ మెకానికల్ ధరణిభాయ్, అకౌంట్స్ విభాగంలో డి.రామమోహన్, పి.వి.ఎస్.నారాయణ, పెట్రోల్ బంక్ పర్యవేక్షణ అధికారులు నాయుడు, పి.లక్ష్మీనరసయ్యలను బాధ్యులుగా చేరుస్తూ గత నెలలో అన్నమయ్య జిల్లా డిపిటిఒ రాము ఆధ్వర్యంలో అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. సుమారు నెలరోజుల విజిలెన్స్ విచారణలో పైన పేర్కొన్న ఆరుగురిని బాధ్యులుగా చేరుస్తూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ శనివారం వారిని సస్పెండ్ చేశారు. ఈ భారీ కుంభకోణంలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరిని కేసు నుండి తప్పించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గత నెలలో పెట్రోల్ బంకు అవినీతిపై ఆడిట్‌కు వచ్చిన ఆడిట్ విభాగ అధికారి బాలాజీ పెట్రోల్ బంకులో ఎటువంటి అవినీతి జరగ లేదని క్లీన్ చీట్ ఇవ్వడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇంతటి భారీ కుంభకోణం జరిగినా ఆ అధి కారి క్లీన్ చిట్ ఇవ్వడంలోనూ ఆయనపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటోనని ఆర్‌టిసి సిబ్బంది చర్చించుకుంటున్నారు. రాజంపేట డిపోలో, జిల్లా కేంద్రంలోనూ విధులు నిర్వహించే ఒక అధికారి పాత్ర కూడా ఈ అవినీతిలో చోటు చేసుకున్నట్లు సమాచారం. విచారణలో ఆయన పేరు కూడా లేకపోవడం గమనార్హం.

విషాదం! ప్రజా'దృష్టి'

ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవలి ఘటనలు కలవరాన్ని కలిగించాయి. ఇటీవల పోరుమామిళ్ల మండలంలో ఈతకెళ్లిన ఓ యువకుడు గల్లంతు కావడం తెలిసిందే. శుక్రవారం రాత్రి రాయచోటి పట్టణంలో చోటుచేసుకున్న వర్షబీభత్సం బారిన పడిన నలుగురు మృత్యువాత పడడం భయాందోళన కలిగించింది. రాయచోటి ఘటనలో రెండు గంటల వ్యవధిలో 135 మి.మీ వర్షపాతం నమోదు కావడం ఊహించని పరిణామం. ప్రకృతి తీవ్రస్థాయిలో కన్నెర్ర చేసినప్పటికీ డ్రెయినేజీ కాల్వలకు కాంక్రీట్ మూతలు మూయడం, కల్వర్టుల దగ్గర మోరీలు, ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేయడంలోని నిర్లక్ష్యమే నలుగురు ప్రాణాలను కోల్పోవడానికి కారణమని గ్రహించాలి. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో డ్రెయినేజీల సామర్థ్యాన్ని, లోతు, వెడల్పుల పరిమాణాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం అంతులేని విషాదాన్ని నింపింది. కడప కార్పొరేషన్‌లో గత రెండేళ్లుగా డ్రెయినేజీల సామర్థ్యాన్ని పెంచారు. డ్రెయిన్ల ఆక్రమణల్ని తొలగించడం, లోతు, వెడల్పులతో కూడిన పనులు చేపట్టారు. రాయచోటి ఘటనల్ని గమనంలోకి తీసుకుని డ్రెయినేజీ వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలం కావడంతో ఉన్నఫళంగా అతివృష్టి లాంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయనే సంగతిని మరువకూడదు. జిల్లా అధికార యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పెన్నా నదీ మీదుగా వెళ్తే సోమశిల వెనుక జలాలు రాజంపేట, బద్వేల్ నియోజకవర్గాలకు చెందిన ఒంటిమిట్ట, అట్లూరు, నందలూరు మండలాల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. సోమశిల వెనుకజలాల పరిధిలోని వేలాది ఎకరాల పంట మునిగిపోతోంది. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని అట్లూరు మండల పరిధిలోని ముంపు గ్రామాలకు వెళ్లే రహదారులు, బ్రిడ్జిలను సైతం వెనుకజలాలు ముంచెత్తుతున్నాయి. ముంపు పరిహారం కోసం దశాబ్దాల తరబడి నిర్వాసితులు నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లాలోని గండికోట, సోమశిల, పైడిపాలెం, చిత్రావతి వంటి సాగునీటి ప్రాజెక్టుల కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను సత్వరమే ఆదు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒంటిమిట్ట మండలంలోని తప్పెటవారిపల్లి, దవంతరపల్లి, పెన్నపేరూరు వంటి గ్రామాలను వెనుకజలాలు చుట్టుముట్టాయి. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లలోనికి పాములు, తేళ్లు ఇతర విషకీటకాలు వెళ్తున్న ఘటనలతో గ్రామీణులు బెంబేలెత్తిపోతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిర్వాసితులు ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ పలుమార్లు ప్రదక్షిణ చేస్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. సోమశిల, బ్రహ్మసాగర్ రిజర్వాయర్ల కోసం ఇళ్ల, భూములు సహా సర్వం త్యాగం చేసిన వారిలో వందలాది మంది అర్హులకు ఉద్యోగాలు ఇస్తామని చూపించిన హామీ నేటికీ అమలుకు నోచుకున్న దాఖలాల్లేవు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు, అర్హులైన వారికి ఉద్యోగాలు హామీని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ప్రజాశక్తి-మదనపల్లె: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం ఫర్ గర్ల్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 5వ డాన్ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ డి.సదాశివ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన కరాటే నైపుణ్యాలను అలవరచుకోవాలన్నారు. సమాజంలో పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో ముందంజ వేయడానికి ఆత్మవిశ్వాసం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు పాల్గొన్నారు.

అధికారులు సంసిద్ధంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మదనపల్లె రాజంపేట సబ్ కలెక్టర్లు, రాయచోటి ఆర్‌డిఒ వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపిడిఒలతో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను వెంటనే చేపట్టాలని చెప్పారు. జిల్లాలో అత్యధిక వర్షపాతం వల్ల పొంగి ఉన్న వాగులు, వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల వల్ల తెగిపోయే రహదారులు, కల్వర్టులు వద్ద వాహనాల రాకపోకలను వెంటనే నిలిపివేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ వారు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ వైర్లపై దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ప్రజా సంక్షేమం కోసం బాధ్యతగా పనిచేస్తు న్నామని స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శనివారం ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను 9వ వార్డు పరిధిలోని సుభాష్ రోడ్డులో వార్డు ఇన్‌ఛార్జి నాదెళ్ల బాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోం దన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైసిపి నాయకులు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, సహజ వనరులను ఇష్టానుసారం దోచుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రామకృష్ణ ఆచారి, ఎమ్మెల్యే సోదరుడు జంషీర్, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మీ, రాధమ్మ, విజయమ్మ, నాగమణి, మండిపల్లె మధుసూదన్‌రెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె: మిట్స్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం జాతీయ స్థాయి ఆర్టికల్ ప్రెజెంటేషన్ అండ్ పేపర్ పబ్లికేషన్స్‌పై అవగా హన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి విభాగా ధిపతి డాక్టర్ శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా ప్రయాణం ప్రారంభ దశలోనే పరిశోధన, రచనా నైపుణ్యం, విజ్ఞానాన్ని పెంచుకునే అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ నిత్య, డాక్టర్ సుధాకరన్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి-పీలేరు: విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలు సేవా భావాన్ని అలవర్చడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య సిద్ధాంతమని డిఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం పీలేరు పట్టణంలోని శ్రీభువన విద్యాలయంలో కొత్తగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం పెంచడానికి, మానసిక స్థైర్యం నింపడానికి స్కౌటిజం తోడ్పడుతుందన్నారు. జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పని సరన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ వై.లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎడి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు గుణలక్ష్మి, ఎఎస్‌ఒసి లక్ష్మీకర్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన రాజకీయాలే లక్ష్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పవన్ కల్యాణ్ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని, విలువలతో కూడిన రాజకీయాలే జనసేన లక్ష్యమని ఎపిఐఐసి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ స్పష్టం చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిరంజీవి, పవన్‌కల్యాణ్ మీద అభిమానంతో తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 10 ఏళ్లుగా పార్టీలో అనేక బాధ్యతలు అప్పగించి అధినేత పవన్ కల్యాణ్ సముచిత స్థానం కల్పించారన్నారు. 26వ తేదీన బాధ్యతలు స్వీకరించబోతున్నానని తెలిపారు. నియోజకవర్గంలో గార్మెంట్స్, టమోటా ఫల్ప్ యూనిట్, ఆటోనగర్ నిర్మాణం, ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి ఓర్వలేకే విమర్శలు : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుంటే వైసిపి నాయకులు ఓర్వలేక పోతున్నారని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఇటీవల మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశంపై నానా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. 17 మెడికల్ కళాశాలలను తామే నిర్మించి పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందిస్తామని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇసుక మాఫియాతో కనీవిని ఎరుగని రీతిలో దోపిడీ చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజన్న, గ్రామ ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, చలపతి, నాగరాజు, మొలకలదిన్నె శ్రీను, లక్ష్మన్న, రెడ్డప్ప, మల్లికార్జున, కోళ్లబైలు రవి పాల్గొన్నారు.


ఉచిత మెటీరియల్ చూపుతున్న విద్యార్థులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో దసరా సెలవులు సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా ఉపాధ్యాయుడు రమణ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల్లో పిల్లలు ఆనందంగా అభ్యసించడానికి నేర్చుకున్న విషయాలు మర్చిపోకుండా ఉండేందుకు పజిల్స్, రంగులు వేయడం, కథలు, సృజనాత్మకత కృత్యాలు, చుక్కలు కలిపి చిత్రం గీయడం, మంచి దస్తూరి వంటి అంశాలు ఈ మెటీరియల్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. ఈమెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయో తెలిపారు.

రేపటి నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని గండబోయనపల్లి శ్రీ సత్యమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేది వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పులి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి అభిషేకాలు, హోమాలు, అలం కరణ, తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

శరన్నవరాత్రి ఆహ్వాన పత్రికలు విడుదల

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం దసరా ఆహ్వాన పత్రికలను ఆర్యవైశ్య సంఘం సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి మాట్లాడుతూ 22 వ తేదీ దీక్ష బంధన అలంకారం,23న పార్వతీదేవి అలంకారం, 24న గజలక్ష్మీదేవి అలంకారం, 25న కృష్ణమూర్తి అలం కారం,26న తోటోత్సవం, మోహిని అలంకారం, 27న మీనాక్షి దేవి అలంకారం, 28న గాయత్రీదేవి అలంకారం,29న సరస్వతిదేవి అలంకారం, 30న మహిషాసుర మర్దిని అలంకారం, అక్టోబర్1న అన్నపూర్ణాదేవి అలంకారం, 2న శమీదర్శనం గ్రామోత్సవం, రాత్రి రాజరాజేశ్వరి దేవిఅలంకారం, 3న ఉదయం వసంతోత్సవం, రాత్రి ఊంజల సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా మండలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి- నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో-ఆర్డినేటర్ గౌరీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడా పోటీలు రెండవరోజూ శనివారం ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలలో రాయచోటి డివిజన్ డిప్యూటీ డిఇఒ నాగయ్య, ఎంఇఒ అనంతకృష్ణ, పాటూరు ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత ముఖ్య అతిథులుగా విచ్చేశారు. షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, షటిల్‌లలో 14, 17 సంవత్సరాల లోపు బాల బాలికలు రెండేసి జట్లుగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సుస్మిత, సునీత, జగన్, వెంకట మధు, రత్నకుమారి, ప్రభాకర్ తదితరులు ఈ పోటీలను ప్రణాళికబద్ధంగా నిర్వహించారు. పోటీలలో విజేతలైన వారిని ముఖ్య అతిథులు అభినందించారు. పరుగు పందెం, జావెలిన్ త్రో, ఖోఖో తదితర పోటీలను దసరా సెలవులు అనంతరం నిర్వహిస్తామని ఈ సందర్భంగా పాఠశాల క్రీడల మండల కో-ఆర్డినేటర్ గౌరీ ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, శిల్పి ఆనందా చారి, నాగిశెట్టి లక్ష్మీ నారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, గొంటుముక్కల వెంకటరమణ, గీత, జ్యోతి ప్రియ, ప్రసాదరావు, ఆర్‌వి రమణమ్మ, విజయ కుమారి, మస్తాన్, గాయత్రీ దేవి, డాక్టర్ శర్వాణి, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ జివి.పల్లవి ఆదేశాల మేరకు శనివారం బిసి కాలనీ, పాశం వీధులలో పారిశుధ్య కార్మికులు ఫాగింగ్, మలాథిన్ స్ప్రే చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించారు. గత కొంతకాలంగా దోమల బెడద ఎక్కువ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కమిషనర్ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణ చర్యలను చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధులలో మున్సిపల్ సిబ్బంది ద్వారా దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌ఐ రెడ్డి మస్తాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబు నాయక్ తెలిపారు.ప్రజలు సైతం దోమల బారిన పడకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

25న రణభేరి సదస్సును జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గాలివీడు : కూటమి ప్రభుత్వం విద్యా రంగం అవలంభిస్తున్న వ్యతిరేక విధా నాలపై, ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగట్టేందుకు ఈనెల 25న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో రణభేరి సదస్సును నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ తెలిపారు. శనివారం మండల కేంద్రం గాలివీడులో యుటిఎఫ్ రణభేరి సదస్సు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యలను పరిష్కరించకుండా నిస్తేజంగా ఉందన్నారు.ప్రభుత్వ విద్యా రంగం, ఆర్థిక అంశాలలోనూ కూటమి ప్రభుత్వం కూడా గత వైసిపి ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నందున ఉద్యోగ ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు ఫయాజున్నిస, మహేశ్వరయ్య, ఖాదర్ వలి, శివారెడ్డి, ఇర్షాద్, నాగరాజు, సయ్యద్ బాషా, సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులను ఆదరించండి

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్: ఆర్గానిక్ ఉత్పత్తులను ఆదరించాలని నిర్వాహకులు రాజశేఖర్, శంకర్ కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో పల్లెల్లో చిరుధాన్య పంటలైన కొర్ర, ఆరిక, సామ, సద్ద, జొన్న, పెసర, ఉలవల పంటల నుండి తయారు చేసిన వంటకాలను తినడం ద్వారా శరీరానికి తగు మోతాదులో అవసరమైన పోషకాలు లభించి షుగర్, బిపి, రక్తహీనత వంటి వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేవారన్నారు. ఎన్నో రోగాలను అరికట్టే గుణాలు కల్గిన చిరుధాన్యాల వంటకాలను తినడంవల్ల రోగాలు దరిచేరవని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలోని రామాలయంలో తమ టింబక్ట్ ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశామని, పట్టణ ప్రజలు మేళాకు విచ్చేసి ఆహార భద్రతను, పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

ఘనంగా గురజాడ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

జెవివి ఆధ్వర్యంలో నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య కవితా పితామహుడు, మహాకవి గురజాడ వెంకట అప్పారావు అని తెలిపారు. గురజాడ జయంతి సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక వారికి ధన్యవాదాలు తెలియజేశారు . కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు రవీంద్రారెడ్డి ,ఆంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

మొక్కను నాటుదాం..పచ్చదనాన్ని పెంచుదాం

ప్రజాశక్తి-రాయచోటి

పచ్చదనం, పరిశుభ్రత వేల సంవత్సరాల మన సంస్కృతిలో భాగమని, జిల్లా ప్రజలందరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సంబేపల్లిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సెప్టెంబర్ మూడో శనివారం రోజు 'గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్' అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని చెప్పారు. పరిశుభ్రత అనేది ఎన్నో వేల సంవత్సరాల నుంచి మన సంస్కృతిలో భాగమని, పాశ్చాత్య దేశాల వారు మన సంస్కృతి నుంచి పరిశుభ్రతను నేర్చుకొని అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రజలందరూ మొక్కలు నాటి వాటిని పెంచి జిల్లా వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చివరిగా మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను కార్యక్రమంలో పాల్గొన్న వారి అందరి చేత చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయ శాఖ అధికారి లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి రాధమ్మ, తహశీల్దార్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపిడిఒ రామచంద్ర పాల్గొన్నారు. **మదనపల్లె:** పట్టణంలోని జడ్‌పి హైస్కూల్, కోమటి వాని చెరువు సమీపంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్ భాషా పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** ప్రజలందరూ ఒక్కొక్క మొక్కను నాటి పచ్చదనాన్ని పెంచడానికి కృషి చేయాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, జడ్‌పి హైస్కూల్ తెలుగు హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్, ఇతర అధికారులతో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒలు పద్మావతి, నారాయణ, హెచ్‌ఎం అంజాద్ అలీఖాన్, ఎపిఒ రమేష్, ఎపిఎం మురళి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందలూరు :** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర గ్రీన్ డే సందర్భంగా నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని నారాయణ రాజుపేట ఎర్రచెరువుకట్ట రహదారి పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఇఒ సురేష్ , సిబ్బంది సుధీర్, శివ గ్రామస్తులు మట్టిబాబు, తుమ్మాది శివకు మార్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు విద్యార్థిని విద్యార్థులు సహకరించాలని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ మొక్కలు నాటడం ద్వారా ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో గాలి శుద్ధి చేయడమే కాకుండా, పోషక విలువలతో కూడిన పండ్లను అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఆయుర్వేద ఆసుపత్రి సూపరిం టెండెంట్ విజయ చంద్రిక ఆధ్వర్యంలో ఐటిపిపి బెటాలియన్ ఆవరణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మదనపల్లి: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

భోజనంలో పురుగులపై డిఇఒ విచారణ


అప్పటి ఉపాధ్యాయులను విచారిస్తున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో పురుగుల భోజనం వడ్డించడంపై డిఇఒ డాక్టర్ సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. ఈ ఏడాది జూన్ 17న ప్రజాశక్తి దినపత్రికలో 'మధ్యాహ్న భోజనంలో పురుగులు' అనే శీర్షికతో వార్తను ప్రచురించింది. స్పందించిన మదనపల్లి డివైఇఒ లోకేశ్వర్‌రెడ్డి అదే నెల 23న విచారణ చేపట్టినట్లు తెలిపారు.డివైఇఒ విచారణలో సేకరించిన వివరాలను ఉన్నత అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ క్రమంలో కడప ఆర్‌జెడి శ్యాముల్ ఆదేశాల మేరకు శనివారం డిఇఒ స్థానిక ఆదర్శ పాఠశాలను తనిఖీలు చేసి, విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ విచారణలో గతంలో ఈ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యా యులను వంట మనుషులను, స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉన్న అంశంపై విచారణలు జరిపి వారి వద్ద నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ రాయించుకున్నట్లు డిఇఒ తెలిపారు. వీరందరూ లిఖిత పూర్వకంగా రాయించిన ప్రతులను క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికలు తయారు చేసి ఉన్నత అధికారులకు నివేదికలు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విచారణలో మిడ్ డే మీల్స్ ఎడి రవికుమార్, డైట్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎంఇఒ-1 మునీంద్రనాయక్, ఎఇఒ-2 రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ గోవిందు, స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, వైస్ చైర్మన్ అక్బర్ అలీ, పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులు, మిడ్ డే మీల్స్ వంట మనుషులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని డిఇఒ పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా, లేదా అని ఆరా తీసినట్లు తెలిపారు. విద్యార్థులకు అందించిన భోజనం మెనూ ప్రకారం ఉండడం చూసి, భోజనాలు రుచికరంగా ఉందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం పథకం ద్వారా మాకు అందిస్తున్న భోజనాలు రుచికరంగా ఉన్నాయని సమాధానం ఇవ్వడంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో అభివృద్ధి పనులు గురించి స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు, వైస్ చైర్మన్ అక్బర్ డిఇఒకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజ నాన్ని తయారు చేస్తున్న వంటగదిలను పరిశీలించి వంట మనుషులతో మిడ్ డే మీల్స్ ఎడి మాట్లా డుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలను అందించాలని వంట మనుషులకు ఆదేశించినట్లు ఎడి తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుతో అధిక లాభాలు : డిఎఒ

ప్రజాశక్తి-రామాపురం

రైతులు పప్పు దినుసు పంటలను సాగు చేయడం వల్ల అధిక లాభలు పొంద వచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ సూచించారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ కొండవాండ్లపల్లి సమీపంలో సాగు చేసిన నవధాన్యాల పప్పుదినుసు పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. నవధాన్యాల పప్పు దినుసు పంటను సాగు చేయడం వల్ల ఒక పంట దెబ్బతిన్న మిగతా పంటల వల్ల రైతుకు నష్టం వాటిల్లదని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయంను అనుసరించడం వల్ల భూమి పంటలు ఉత్పాదక శక్తి పెరుగుతుందని, పంట పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడకం వల్ల భూమిలో సూక్ష్మజీవులు పెరిగి పంట ఆరోగ్యంగా ఎదుగుదలకు వ్యాధి నిరోధక శక్తిగా దోహదపడతాయన్నారు. మామిడి తోటలో నవధాన్యాల పప్పు దినుసుల సాగు చేసుకోవడం వల్ల మంచి లాభాలు పొందుతున్నారు. పంటలను మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ జీవామృతంను ఎలా తయారు చేసుకోవాలో డెమో రూపంలో రైతులతోచేసి చూపించారు. కార్యక్రమంలో చిట్లూరు విఎఎ ఆఫ్రిన్ , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కదురున్నిసా, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు ఇస్తున్న డిఎఒ శివనారాయణ

విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం



రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ భవనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని సన్నపనేని రవీంద్ర నాయుడు తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా 2014-15 విద్యా సంవత్సరంలో నూనెవారిపల్లెలో రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్ నర్సరీ నుంచి 7వ తరగతి వరకు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో ఏర్పడిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని తమ పాఠశాలలో విద్యాబోధన విషయంలో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. తరగతి గదిలో పరిమిత సంఖ్యలో మాత్రమే విద్యార్థులకు అవకాశం ఉంటుందని అన్నారు. తమ పాఠశాలలో విద్యతో పాటు డిబేట్స్ నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో సృజనాత్మకత శక్తిని పెంపొందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు డాన్స్ తో పాటు కరాటే

- సన్నపనేని రవీంద్ర నాయుడు



వంటి ఆత్మరక్షణ విద్యలో కూడా శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతిభావంతులచే ప్రొజెక్టర్ ద్వారా విద్యా బోధన జరుగుతుందని, కంప్యూ టర్‌లో కూడా విద్యార్థులకు మెలకు వలు నేర్పుతున్నామని, అతి త్వరలో రోబో టిక్ తరగతులు కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి తాము అత్యంత ప్రాధాన్యతనిస్తామని, తమ విశాలమైన క్రీడా మైదానంలో విద్యార్థులకు క్రీడలలో తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ విద్యాలయ పురస్కారం

తమ పాఠశాలలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామని, ఇందులో భాగంగానే 2021-22 విద్యా సంవత్సరంలో స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని ఉమ్మడి జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని తెలిపారు. అరుదైన ఈ పురస్కారం ప్రయివేటు పాఠశాలలు దక్కించుకోవడం దాదాపు అసాధ్యమే అయినా తమ పాఠశాలకు ఈ పురస్కారం రావడం గర్వకారణంగా ఉందని తెలియజేశారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది సమాజానికి గొప్ప పౌరులుగా అందించడమే లక్ష్యంగా తమ విద్యా సంస్థలు ముందుకెళ్తున్నాయని, అనతికాలంలోనే విశేష ప్రజాదరణతో 2025-26 విద్యా సంవత్సరంలో బి.ఎస్ థియేటర్ కు సమీపంలో మరొక బ్రాంచి ప్రారంభించడం జరిగిందని, సమీపంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల్ని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని కోరారు.

కలకడలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-కలకడ: ఆధార్ కేంద్రాలను మండలంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు లేని వారు, ఆధార్ కార్డు ఉండి అడ్రసు, ఫొటో, పేర్లు, మార్చుకోవడానికి వీలుగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ ఆధార్ కేంద్రాలు ఈనెల 23 నుంచి మండలంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ కేంద్రాల వివరాలు గుర్తించి, తమ తమ ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరి చేసుకోవాలని సూచించినట్టు తెలిపారు. 23న బాలయ్యగారి పల్లి సచివా లయం, 24న బాటవారిపల్లి సచివాలయం, 25న కలకడ సచివాలయం, 26న కోన సచివాలయంలో ఆధార్ కేంద్రాలు పనిచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపిడిఒ పేర్కొన్నారు.

కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ

ప్రజాశక్తి- కలకడ : కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ లకు ఒక్కరోజు శిక్షణ తరగతులను సర్పంచ్ ప్యారి జాన్ అధ్యక్షతన నిర్వహించినట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి రాధమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ సచివాలయం పరిధిలో చెత్తతో సంపద తయారు చేయు కేంద్రంలో పది మండలాలకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిపిఒ మాట్లాడుతూ చెత్తతో సంపద తయారుచేయు కేంద్రంలో కృత్రిమ ఎరువులు తయారుచేసి, వాటిని విక్రయించడం వల్ల ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ లక్ష్మీపతి,మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ ముబారక్‌అలీ, టిడిపి నాయకలు జిలానీబాషా, జాఫర్ హుస్సేన్, ఇర్ఫాన్‌బాషా, పంచాయతీ కార్యదర్శి శైలజ, 10 మండలాలకు సంబంధించి సిఆర్‌పిలు పాల్గొన్నారు.


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

పోషక ఆహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి అన్నారు. శనివారం పోషకాహారం మాసోత్సవాల్లో భాగంగా చెరువుముందరపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం పై గర్భిణులు, బాలింతలకు వగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, కోడుగుడ్లు, కూరగాయలు ప్రతినిత్యం ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం నఫీజా, అంగన్వాడీ కార్యకర్త అరుణ, హెల్పర్ పూర్ణిమ, గర్భవతులు బాలింతలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వం తాజాగా అందిస్తున్న స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సోమవరం పంచాయతీ పూత్తవాండ్లపల్లిలో, పెద్దివీడు పంచాయతీలో, తాటిగుంటపల్లి పంచాయతీలో నాయునివారిపల్లి లో మండల అధ్యక్షుడు భాను గోపాల్ రాజు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విధానం ద్వారా సులభతరంగా సరుకులు అందుకోవచ్చని వివరించారు. ప్రభుత్వ పథకాలకు కార్డును గుర్తింపుగా వినియోగించుకోవచ్చన్నారు.నిత్యవసరాల పంపిణీలో పారదర్శకంగా వీలుం టుందన్నారు. ప్రతి కుటుంబంతో పాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుపై కుటుంబ పెద్ద ఫొటో, పూర్తి వివరాలతోపాటు కుటుంబ సభ్యుల పేర్లు వుంటాయి అన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేయబడిందన్నారు. గ్రామ ప్రజలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇసుక ఇతర జిల్లాలకు తరలిపోకుండా అరికట్టాలని వెంకట్రాంరెడ్డి, ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వంగిమళ్ళ ప్రజలు మండల కేంద్రానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి తప్పకుండా వంగిమళ్ళ ప్రజలకు మండల కేంద్రానికి వచ్చే దానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో ఆయన వెంట తహశీల్దార్ ఖాజాబీ, టిడిపి వంగిమళ్ళ నాయకుడు కల్లూరి రామ్మోహన్‌రెడ్డి, రాజంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బనరసయ్య పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి యువనాయకులు పసుపులేటి గోపి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో రేషన్ దుకాణం-4 డీలర్ పద్మావతి ఆధ్వర్యంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులు ఆయా రేషన్ దుకాణాలలో లబ్ధిదారులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో రవి,రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు.


వీరబల్లి : స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

క్రైం కార్నర్


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కట్టుకున్న భర్త హత్య కేసులో భార్యను, ఆమె తమ్ముణ్ని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి మహేంద్ర అరెస్టు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన జరిపిటి రామన్న తరచూ మద్యంతాగి ఇంట్లో భార్యతో గొడవ పడేవాడని చెప్పారు. దీనికి తోడు అప్పులు ఎక్కువ కావడంతో అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి వేధింపులు చేసేవారన్నారు. తరచూ భార్యాభర్తలు ఘర్షణ పడేవారని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 12న మద్యం తాగి వచ్చిన రామన్న భార్య రమణమ్మతో మరోసారి గొడవకు దిగాడని, ఆమెపై చేయి చేసుకోవడంతో ప్రతిఘటించిన ఆమె పప్పుగత్తితో దాడిచేసిందని పేర్కొన్నారు. రామన్న కింద పడిపోవడంతో రమణమ్మ తమ్ముడు ఈశ్వర్ రుబ్బురోలు గుండుతో తలపై దాడి చేసి కొట్టడంతో రామన్న మృతి చెందాడని తెలిపారు. వారు మృతదేహాన్ని గోనె సంచిలో కట్టుకొని, ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట పట్టణంలోని కస్తూర్బా పాఠశాల వెనుక వైపు ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద పూడ్చి పెట్టారని చెప్పారు. మూడు నెలల తరువాత మృతుడి తమ్ముడు లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. కేసులో మృతుడి భార్య రమణమ్మ, ఆమె తమ్ముడు ఈశ్వర్ దాడి చేసే హత్య చేసినట్లు నిర్ధారించినట్లు చెప్పారు. శుక్రవారం బి.కొత్తకోటకు వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా చేదించడంలో ప్రతిభ చూపిన సిఐ రాజారెడ్డి, ఎస్‌ఐ రహీముల్లా, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెం దిన సంఘటన శనివారం తెల్లవారుజామున కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని చంద్రా కాలనీకి చెందిన సుధాకర్ (58) శుక్రవారం సాయంత్రం తన స్వగ్రామమైన రాయచోటికి ద్విచక్ర వాహనంలో వెళ్ళాడని తెలిపారు. అక్కడ తమ పిల్లల్ని తల్లిదండ్రుల వద్ద వదిలేసి, తిరిగి ఒంటరిగా తెల్లవారుజామున ద్విచక్ర వాహనంలో మదనపల్లెకి బయలుదేరాడని చెప్పారు. మార్గమధ్యంలోని ముదివేడు క్రాస్ సమీపంలో తానామిట్ట వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సునీత, కుమార్తెలు కీర్తన, ధనలక్ష్మి, కుమారుడు పవన్ కుమార్ ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.